సాక్షి
అన్నమయ్య జిల్లా

శనివారం । 8 । జూన్ । 2024



జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు

మదనపల్లెలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల డాక్టర్లు ఏఎస్.కిరీటీ, రమాదేవిలు తనిఖీలు నిర్వహించారు. -8లో



మైనర్.. నో రయ్ రయ్

మైనర్లు వాహనం నడిపితే.. ఆ బండి ఎవరి పేరిట ఉంటే (తల్లిదండ్రులు, సంరక్షకులకు) రూ.25 వేల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.320	రూ.400
రెండోరకం	రూ.230	రూ.310

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 862 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

డైరెక్టర్ పదవికి రాజీనామా



లింగం గంగాదేవి

చిట్వేలి: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో వైఎస్సార్ సీపీ ఓటమిపాలైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం బోర్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి లింగం గంగాదేవి శుక్రవారం రాజీనామా చేశారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తన రాజీనామా పత్రాలను మెయిల్ ద్వారా రాష్ట్ర కార్యాలయానికి పంపించామని తెలిపారు. ఇంతవరకు తమకు సహకరించిన పార్టీ నాయకులకు, అధికారులకు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

నూతన నియామకం



పీటీఎం.శివప్రసాద్

మదనపల్లె: ది బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన పీటీఎం.శివప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.హరిబాబు, శివప్రసాద్‌కు నియామక ఉత్తర్వులు అందజేశారు. మార్చి 2029 వరకు శివప్రసాద్ ఏపీ బుద్ధిస్ట్ రాష్ట్ర కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తారని అందులో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన పలువురు శివప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

12న రాజంపేటలో జాబ్‌మేళా



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 12వ తేదీ ఉదయం పది గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్ కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. సీఎస్ఆర్ ఇనిషియేటివ్ సహకారంతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో11 ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు, టాటా స్ట్రైవ్ నుంచి సీనియర్ ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ మేనేజర్ మార్కండేయులు కూడా పాల్గొంటారని చెప్పారు. ఐటీఐలో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానికల్ మోటార్ వెహికల్, సివిల్, వెల్డర్, మెకానిక్ డీజిల్, కంప్యూటర్ ట్రేడ్‌లలో ఉత్తీర్ణులైన వారితో పాటు ఈఏడాది ఆగస్టులో ఐటీఐ పరీక్షలు రాసే విద్యార్థులు కూడా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఇందులో పాల్గొనే వారు విద్యార్హత, ఆధార్‌కార్డు ఒరిజినల్, జిరాక్స్ కాపీలను, పాస్‌పోర్టుసైజు ఫోటోలను తమవెంట తీసుకురావాలని తెలిపారు. ప్రతిభగల వారికి ఆయా కంపెనీల ప్రతినిధులు తమ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. జిల్లాలోని అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సంఘర్షణ!

'అమ్మా, నాన్న నేను ఇంటిలో ఉండి చదువుకుంటాను. ఇంట్లో వాళ్లను వదిలి ఒక్క క్షణం కూడా ఉండలేను. చదువు పేరుతో నన్ను ఇంటి నుంచి దూరం చేయాలని చూడవద్దు. నాకు మీ ప్రేమానురాగాలు కావాలి. బాగా చదువుకుని టీచరై పిల్లలకు మంచి విద్యాబుద్ధులు నేర్పుతాను'ఓ కుమార్తె అభ్యర్థన.

నువ్వు హాస్టల్లో ఉండి చదవాల్సిందే. మంచి మార్కులు, ర్యాంకులు సాధించి డాక్టర్ కావాలి. తల్లిదండ్రుల సమాధానం.

- బాల్యాన్ని హరిస్తూ యాంత్రిక జీవనానికి అలవాటు చేస్తున్న వైనం
- తల్లిదండ్రుల ప్రేమానురాగాలను దూరమవుతున్న పిల్లలు
- చదువు పేరుతో చిన్న వయస్సులోనే సుదూర ప్రాంతాలకు
- ఒంటరిగా ఉండలేక ఇంటి బాట పడుతున్న విద్యార్థులు
- తల్లిదండ్రుల ధోరణి మారాలంటున్న వైద్యులు



మదనపల్లె సిటీ: పిల్లల ఆలోచన, వారి అభిరుచులకు భిన్నంగా తల్లిదండ్రులు స్పందిస్తున్నారు. దీంతో పిల్లలు ఒంటరిగా హాస్టళ్లలో ఉండలేకపోతున్నారు. కొందరు ఆత్మన్యూనతా భావంతో పెరిగి పెద్దవారై ఒంటరితనానికి అలవాటు పడుతున్నారు. జిల్లాలో జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభమయ్యాయి. చాలా మంది తమ పిల్లలను విజయవాడ, గుంటూరు,తిరుపతి, కడప వంటి నగరాల్లోని కార్పొరేట్, రెసిడెన్షియల్ కాలేజీల్లో చేర్పిస్తున్నారు. అక్కడ హాస్టళ్లలో ఉండలేక చాలా మంది ఇంటి బాటపడుతున్నారు. మరి కొందరు తల్లిదండ్రులు బలవంతంగా అక్కడే ఉండమని నచ్చచెబుతున్నారు. దీంతో విద్యార్థులు ఒంటరితనంతో నిత్యం మానసిక సంఘర్షణ పడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాలో పలువురు విద్యార్థుల తల్లిదండ్రులకు ఎదరవుతున్నాయి.

- బాల్యం పిల్లలకు దేవుడిచ్చిన వరం. తల్లిదండ్రుల ప్రేమానురాగాల మధ్య ఆడుతూ పాడుతూ, చిరునవ్వులు చిందిస్తూ ఆస్వాదించాలి. అప్పుడే బాల్యానికి సాకారం. ప్రపంచాన్ని అర్థం చేసుకునే విధానం కుటుంబం నుంచి రావాలి. నేటీ పోటీ ప్రపంచం, ప్రపంచీకరణ నేపథ్యంలో తల్లిదండ్రులు పిల్లలను యాంత్రిక జీవనానికి అలవాటు చేస్తున్నారు. బాల్యంలోని మధురానుభూతులకు దూరం చేస్తున్నారు. పిల్లలను మార్కులు, ర్యాంకులను తయారు చేసే యంత్రాలుగా చేస్తున్నారు. దీని కోసం వారి ఇంటి నుంచి దూరంగా కార్పొరేట్ పాఠశాలల్లో బలవంతంగా చేర్పిస్తున్నారు. పాఠశాల స్నేహితుల సాన్నిహిత్యం ఉన్నా అమ్మ పంచే ప్రేమకు ఏటీ సాటిరాదు. నాన్న చూపే ఆదరణ ఏదీ సరితూగవు. దీంతో పిల్లలు తమలో తాము సంఘర్షణ పడుతూ జీవితాన్ని గడపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎప్పుడూ మార్కులు, ర్యాంకులే కాకుండా వారి కోసం కాస్త సమయాన్ని కూడా కేటాయించి ప్రేమను పంచాలని పిల్లల తల్లిదండ్రుల నుంచి ఆశిస్తున్నారు. ఇదే విషయాన్ని మనోవ్యక్తిత్వ వికాస నిపుణులు కూడా అంటున్నారు. లేనిపక్షంలో పిల్లల్లో భావవ్యక్తీకరణ నైపుణ్యం తగ్గడంతో పాటు అభద్రతా భావం పెరుగుతుందని చెబుతున్నారు. కౌమార దశలోని పిల్లలకు తల్లిదండ్రుల నుంచి సరైన ప్రేమానురాగాలు లభించకపోతే వారిలో మానసిక రుగ్మతలు చోటు చేసుకుంటాయని వెల్లడిస్తున్నారు. ఆయా వయస్సులో వచ్చే శారీరక, మానసిక మార్పులను సరిచేయక, సరైన మార్గదర్శనం చేయకపోతే పిల్లల భవిష్యత్తు అంధకారమవుతుందని సూచిస్తున్నారు. కొందరు పిల్లలు తప్పటడుగులు వేసే ప్రమాదం కూడా లేకపోలేనది హెచ్చరిస్తున్నారు. మరికొందరైతే ఏ చిన్న సమస్య ఎదురైనా అఘాయిత్యాలకు పాల్పడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ

గతంలో అవ్వా,తాతలు, అమ్మానాన్నలు, చిన్నాన్న,పెద్దనాన్న, వారి పిల్లలతో కూడిన ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. కాలానుగుణంగా చోటు చేసుకుంటున్న మార్పులతో ఉమ్మడి కుటుంబవ్యవస్థ కనుమరుగైంది. నేటి తల్లిదండ్రుల ఆలోచనా విధానంతో కనీసం కన్న బిడ్డలతో కూడిన సమష్టి కుటుంబ వ్యవస్థ కూడా మాయమైపోతోంది. పిల్లలను వసతిగృహాలు,రెసిడెన్షియల్ పాఠశాలల్లో చేర్పించి ఒంటరి జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటున్నారు. సమాజంలో అనుబంధం,ప్రేమ,వాత్సాల్యం అనే పదాలకు అర్థాలు కూడా మరచిపోతున్నారు.

మానసిక ఒత్తిడితో అనర్థాలు



చిన్నప్పటి నుంచే పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమైతే మానసిక ఒత్తిడి పెరిగి అనేక అనర్థాలకు దారి తీస్తాయి. ఆస్పత్రులకు వైద్య పరీక్షల కోసం వచ్చే విద్యార్థుల్లో అనేక మంది మానసిక ఒత్తిడికి గురైన వారే ఉంటున్నారు. ఇంటికి, తల్లిదండ్రులకు దూరంగా ఉన్నందున ఆహారం సరిగ్గా తీసుకోకపోవడంతో వ్యాధులకు గురవుతున్నారు.

– చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

ప్రేమానురాగాలు పంచాలి



ఆధునిక జీవన విధానంలో అమ్మానాన్నల ఆలోచనా ధోరణి మారాలి. ప్రతిభను బట్టి ఉద్యోగావకాశాలు లభిస్తాయన్న వాస్తవాన్ని గుర్తించాలి. ఉకౌమార దశలో పిల్లలకు కుటుంబంలోని ప్రత్యక్షానుభవాలు అవసరం. ఈ దశలో పిల్లలు ఎదుర్కొనే సంఘర్షణలను అమ్మానాన్నలు మాత్రమే అర్థం చేసుకోగలరు. పిల్లల కోసం సమయాన్ని కేటాయించాలి. వారికి ప్రేమానురాగాలు పంచాలి.

-ఎస్.రెడ్డప్పరెడ్డి, అధ్యాపకులు,బాలికల జూనియర్ కాలేజీ, మదనపల్లె

ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి



బాల్యంలో చిన్నపిల్లలకు తల్లిదండ్రుల ప్రేమానురాగాలు చాలా అవసరం. ఉద్యోగులైనా పిల్లల కోసం రోజూ కొంత సమయాన్ని కేటాయించాలి. చదువంటే మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదనే విషయాన్ని గ్రహించాలి. పిల్లల అభిరుచి మేరకు వారిని ఎదగనివ్వాలి. వారికి ఇష్టమైన రంగాల్లో ప్రోత్సాహించాలి.

-టీఎస్‌పి క్రిష్ణమూర్తి, ప్రముఖ నవలా రచయిత, మదనపల్లె

అభ్యసనతోనే ప్రాథమిక విద్య బలోపేతం

- దీఈఓ శివప్రకాష్ రెడ్డి



శిక్షణ సందర్భంగా డీఆర్పీలను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఈఓ శివప్రకాష్ రెడ్డి

రాయచోటి: అభ్యసనతోనే ప్రాథమిక విద్య బలోపేతం అవుతుందని అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి యు శివప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు. రాయచోటి డైట్ కళాశాలలో రెండు రోజులపాటు నిర్వహించిన డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్లకు(డీఆర్పీ) శిక్షణా కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేసే చర్యల్లో భాగంగా గత ఏడాది ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (అక్షరాస్యత, సంఖ్యాశాస్త్రంలో పునాది) 60 రోజుల సర్టిఫికెట్ కోర్సుకు సంబంధించి డీఆర్పీలకు శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. తిరిగి జిల్లాలో ఎంపికైన 90 మంది డీఆర్పీలకు రెండు రోజుల రిఫ్రెషర్ శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ పొందిన డీఆర్పీలు తిరిగి మండలస్థాయిలో ఉన్నతాధికారులు నిర్ణయించిన తేదీల్లో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మొదటిరోజు స్టేట్ అబ్జర్వర్‌గా గిరిబాబు యాదవ్ శిక్షణా కార్యక్రమాన్ని సందర్శించారు. రిసోర్స్ పర్సన్ (కెఆర్‌పీ)లుగా ఉపేంద్ర కుమార్, శ్యామల దేవి, డైట్ లెక్చరర్ రెడ్డయ్యలు వ్యవహరించారు. శిక్షణను డైట్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి రెండు రోజులుగా పర్యవేక్షించారు. మండల విద్యాశాఖాధికారులు పి నాగరాజు, ఆంజనేయులు కోర్సు ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. డైట్ లెక్చర్లు శివభాస్కర్, పీఎస్ఎండీ అసదుల్లా, నాగరాజులు, సమగ్ర శిక్ష అసిస్టెంట్ అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జి షమీవుల్లా ఖాన్‌లు పాల్గొన్నారు. శిక్షణలో 90 మంది డీఆర్‌పీలకుగాను 82 మంది మాత్రమే హాజరయ్యారు.

డిజిటల్ పేమెంట్స్‌లో ప్రొద్దుటూరు ప్రథమం



మద్యం దుకాణంలోని సిబ్బందితో మాట్లాడుతున్న డిపో మేనేజర్ తిమ్మరాయిడు

ప్రొద్దుటూరు క్రైం: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నిర్వహిస్తున్న డిజిటల్ పేమెంట్స్ చెల్లింపులో ప్రొద్దుటూరు రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఏపీఎస్‌బీసీఎల్ డిపో మేనేజర్ తిమ్మరాయుడు తెలిపారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాలను ఆయన శుక్రవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరు ప్రభుత్వ లిక్కర్ డిపో పరిధిలోని ప్రొద్దుటూరు, మైదుకూరు, పులివెందుల, కమలాపురం, బద్వేల్, జమ్మలమడుగు నియోజకవర్గాల్లోని మద్యం దుకాణాల్లో గత నెలలో రూ.63.42 కోట్ల మద్యం విక్రయాలు జరిగినట్లు తెలిపారు. మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన పలువురు సూపర్‌వైజర్లు, సేల్స్‌మెన్‌లపై చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. అధిక ధరలకు మద్యం విక్రయాలు, నకిలీ లేబుళ్లు, కల్తీ మద్యం విక్రయాలపై నిఘా పెట్టామన్నారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిబంధనలకు మేరకు మద్యం విక్రయాలు జరపాలని సిబ్బందిని ఆదేశించారు.

కార్పొరేషన్ల డైరెక్టర్ల రాజీనామా



రాజీనామా చేసిన కార్పొరేషన్ల డైరెక్టర్లు

ప్రొద్దుటూరు: వైఎస్ఆర్ జిల్లాలో పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు శుక్రవారం రాజీనామా చేశారు. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్ రెడ్డి, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళి, పూసల కార్పొరేషన్ తుపాకుల వెంకటరమణ, తొగట వీరక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ చౌడం రవి చంద్ర, ఆరెకటిక కార్పొరేషన్ డైరెక్టర్ ఉమామహేశ్వరి, నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ రాగా నాగలక్ష్మి రాజీనామా చేసిన వారిలో ఉన్నారు.

స్టాఫ్‌నర్స్ నియామకాలపై సందేహాలు

వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో నవంబర్‌లో ప్రభుత్వం స్టాఫ్‌నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. వచ్చిన దరఖాస్తుల ఆధారంగా నాలుగు విడతలుగా నియామక ప్రక్రియ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఐదవ విడత నియామక ప్రక్రియ నిలిచింది. అర్హులైన అభ్యర్థుల్లో నియామక కౌన్సెలింగ్ నిలువుదలతో సందేహాలు నెలకొన్నాయి.

- 5వ విడత కౌన్సెలింగ్ నిలుపుదల
- 206 మందికి సెలెక్షన్ జాబితా కొనసాగిస్తారా.. లేదా?
- అర్హులైన అభ్యరుల్లో ఆందోళన



వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్: ప్రభుత్వం వైద్యరంగంలో పెద్ద ఎత్తున నియామకాలను చేపట్టింది. ఆ మేరకు కడప వైద్య ఆరోగ్యశాఖ జోన్–4 పరిధిలో పెద్ద సంఖ్యలో స్టాఫ్ నర్స్ నియామకాలను చేపట్టారు. ఫలితంగా వేలాది మంది నిరుద్యోగులు ఉద్యోగులుగా మారారు. తాజాగా రెండు రోజుల క్రితం చేపట్టిన స్టాఫ్‌నర్స్ నియామక కౌన్సెలింగ్ ప్రక్రియ నిలిచిపోవడంతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొంది.

10 వేలకు పైగా దరఖాస్తులు

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఇప్పటికే వందలాది మంది నిరుద్యోగులు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులుగా నియమితులయ్యారు. ఈ క్రమంలోనే నవంబర్ నెలలో ప్రభుత్వం మరో మారు కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు సంబంధించి అభ్యర్థుల నుంచి 10 వేలకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటి ఆధారంగా కార్యాలయ సిబ్బంది నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జాబితా తయారు చేశారు. ఆ జాబితా ఆధారంగానే విడతల వారీగా కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హులైన వారికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. ఆ విధంగా ఒక్కో విడతకు వంద మందికి చొప్పున నాలుగు విడతలుగా నియామక కౌన్సెలింగ్ చేపట్టారు. 5వ విడతగా మదనపల్లి, పులివెందుల, ఆదోని మెడికల్ కాలేజీలకు 206 స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. ఈ తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో నియామక కౌన్సెలింగ్‌కు ఆటంకం ఏర్పడింది. తరువాత ఎన్నికలు ముగియడంతో ఇది వరకే రూపొందించిన అభ్యర్థుల ఎంపిక జాబితాతో నియామక కౌన్సెలింగ్ నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ నియామకంపై కొత్తగా ఏర్పడే ప్రభుత్వంలోని ఉన్నత స్థాయి వ్యక్తుల నుంచి ఒత్తిళ్లు వచ్చాయి. అనంతరం ఉన్నతాధికారుల తర్జనభర్జనల తర్వాత నియామక కౌన్సెలింగ్‌ను నిలుపుదల చేశారు.

ఎంపిక జాబితానే కొనసాగిస్తారా?

ఎంపికైన అభ్యర్థులు కౌన్సెలింగ్ కోసం కడపకు వచ్చారు. కౌన్సెలింగ్ ప్రక్రియ నిలుపుదల కావడంతో వారిలో అనేక సందేహాలు నెలకొన్నాయి. 5వ విడత ఎంపిక చేసిన జాబితా ప్రకారం కౌన్సెలింగ్‌ను నిర్వహిస్తారా. లేక కొత్తగా వచ్చే ప్రభుత్వం కొత్త నోటిఫికేషన్ ఏమైనా జారీ చేస్తుందా..? అనే సందేహాలు అభ్యర్థుల్లో నెలకొన్నాయి. ఒకవేళ కొత్తగా ఏర్పడే ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేస్తే, మెరిట్ ఆధారంగా ఇప్పటికే ఎంపికైన తమకు ఉద్యోగం దక్కదేమోనని ఆందోళన వారిలో నెలకొంది. ఈ విషయమై ఎంపికైన అభ్యర్థులు సంబంధిత అధికారులను ఆరా తీశారు. అయితే ఇందుకు సంబంధించి అధికారుల వద్ద స్పష్టమైన సమాచారం లేకపోవడంతో అభ్యర్థులకు ఎలాంటి భరోసా ఇవ్వలేక పోయారు. కాగా సాంకేతిక కారణాలు, ఇతర సమస్యలు ఏమైనప్పటికీ నిబంధనల ప్రకారం 5వ విడతలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను అనుసరించి అర్హులకు ఉద్యోగాలు దక్కాల్సి ఉంది. కొత్తగా ఏర్పాటయ్యే ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటామని ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రత్నకుమారి తెలిపారు.

జోరు వాన

- అత్యధికంగా గాలివీడులో 88 .2 మి.మీ. వర్షపాతం నమోదు
- ఈదురు గాలులకు నేలకొరిగిన చెట్లు
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు

మండలం	కురిసిన వర్షం(మి.మీ)	మండలం	కురిసిన వర్షం(మి.మీ)
గాలివీడు	88.2	పీలేరు	28.6
రాయచోటి	71.2	వీరబల్లి	18.2
ములకల చెరువు	65.6	టి సుండుపల్లె	15.4
పెద్దమండెం	56.8	కురవలకోట	15.4
గుర్రంకొండ	55.0	రామాపురం	15.0
చిన్నమండెం	44.2	వాల్మీకిపురం	13.2
కలికిరి	44.2	కలకడ	11.4
సంబేపల్లె	40.8	కంభంవారిపల్లి	6.2
తంబళ్లపల్లి	36.6	పెనగలూరు	5.6
లక్కిరెడ్డిపల్లి	30.0	పీటీ సముద్రం	1.6



కడపలో జలమయం అయిన ఆర్టీసీ బస్టాండు పరిసర ప్రాంతాలు

రాయచోటి: ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో రెండు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. శుక్రవారం రాత్రి జిల్లాలోని రాయచోటి, రాజంపేట, తంబళ్లపల్లి, పీలేరు, మదనపల్లి, గాలివీడు, చిన్నమండెం, సంబేపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లి, తంబళ్లపల్లి, పెద్దమండెం, గుర్రంకొండ, కలికిరి, పీలేరు, కురబలకోట, వాల్మీకిపురం తదితర ప్రాంతాల్లో మంచి వర్షం కురిసింది. వాన రాకతో భూమి పదునెక్కింది. ఖరీఫ్‌లో లోతైన దుక్కులు చేసుకోవడానికి వీలు కలిగింది.దీంతో రైతులు సాగుకు సమాయత్తమవుతున్నారు.గాలివీడులో అత్యధికంగా 88.2 మిల్లీమీర్లు, పెద్దతిప్ప సముద్రంలో అత్యల్పంగా 1.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావారణ నిపులు తెలియజేస్తున్నారు.

నేలకొరిగిన భారీ వృక్షం



ఓబులవారిపల్లెలో రహదారిపై కూలిన చింతచెట్టు

ఓబులవారిపల్లె: మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. బలమైన గాలులకు మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై భారీ చింతచెట్టు నేలకొరిగింది. అటవీశాఖకు సంబంధించిన ఈ చెట్టుకు గతంలో రెండుసార్లు నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది అప్పట్లో మంటలను అదుపు చేశారు. అప్పటి నుంచి ప్రమాదకరంగా దీనిని అటవీశాఖ అధికారులు తొలగించలేదు. గాలులు వీయడంతో ఎప్పుడూ రద్దీగా ఉన్న ప్రధాన రహదారిపై చింతచెట్టు అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. విద్యుత్ తీగలు తెగిపడటంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. రాకపోకలు నిలిచిపోయాయి.

కడపలో కుమ్మేసింది

కడప కార్పొరేషన్: కడప నగరంలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో వాన కొద్దిసేపే కురిసినా.. పెద్ద ఎత్తున నష్టం చేకూర్చింది. డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి. ఆర్టీసీ బస్టాండు జలమయం అయింది. ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఆర్టీసీ బస్టాండు, జిల్లా కోర్టు, ఆర్టీసీ ఆర్ఎం కార్యాలయం, ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్, కోటిరెడ్డి సర్కిల్ ప్రాంతాల్లో భారీ స్థాయిలో వర్షపునీరు నిలవడంతో రాకపోకలు సాగించడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపునీరు ఎటూ పోయేందుకు మార్గం లేకపోవడంతో కోటిరెడ్డి సర్కిల్ నుంచి మురళీ థియేటర్ వైపుగా బుగ్గవంక వరకూ జేసీబీలతో కాలువ తీసేందుకు పనులు సాగించారు. నగరంలోని పలు లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో జనజీవనం స్తంభించింది. నగర శివారు ప్రాంతాలైన రామాంజనేయపురం, వరదకాలనీ, ఆచారి కాలనీ, జర్నలిస్టుకాలనీ, ఏఆర్‌పీ కాలనీ, దండోరా కాలనీ, తిలక్‌నగర్, ఆర్‌కే నగర్, ఎస్‌బీఐ కాలనీ, నకాష్, బండ్లమిట్ట, శాస్త్రినగర్, అక్కాయపల్లె, గంజికుంట కాలనీ, గౌస్ నగర్, అశోక్‌నగర్, ప్రకాష్‌నగర్, నిరంజన్ నగర్ తదితర కాలనీల్లో వర్షపునీరు నిలిచి ప్రజలు అవస్థలు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా మట్టి రోడ్లు ఉన్న శివారు ప్రాంతాల్లోని జనం బురదలో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల విద్యుత్ లైన్లు, స్తంభాలు దెబ్బతిన్నాయి.



రాయచోటిలో జోరుగా కురుస్తున్న వర్షం

వేసవి శిక్షణ విద్యార్థులకు వరం

కడప కల్చరల్ : వేసవి శిక్షణా శిబిరాలు విద్యార్థులకు వరం లాంటివని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.అమీరుద్దీన్ అన్నారు. కడపలో జరిగిన వేసవి శిక్షణా శిబిరాల ముగింపు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

క్లుప్తంగా

జిల్లా ఆస్పత్రిలో తనిఖీలు



ఆస్పత్రిలో ఏర్పాట్లపై సూచనలిస్తున్న ఎస్వీ.మెడికల్ కళాశాల వైద్యులు

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాల డాక్టర్లు ఏఎస్.కిరీటీ, రమాదేవిలు తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి, మెడికల్ టీచింగ్ ఆస్పత్రిగా మార్చేందుకు నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం పరిశీలనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను వారు పరిశీలించారు. ఆస్పత్రిలోని విభాగాలను పరిశీలించి, చేయాల్సిన మార్పులను సూచించారు. మెడికల్ కళాశాల నిర్మాణం, పురాతన నూతన భవనాలు, కల్పించాల్సిన వసతులపై సూచనలు చేశారు. ఆస్పత్రి భవనాల్లో ప్రత్యేక విభాగాల ఏర్పాటు, నూతన యంత్ర పరికరాల దిగుమతి, తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ జమున, సూపరింటెండెంట్ ఎం.ఎ స్.రాజు, డీఈ కరీముల్లా, సీనియర్ వైద్యులు బాబు, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు న్యాయం



స్పిన్నింగ్ మిల్లు కార్మికులకు గ్రాట్యుటీ చెక్కులను అందిస్తున్న యాజమాన్యం

మదనపల్లె : మదనపల్లె స్పిన్నింగ్ మిల్స్ వర్కర్స్ యూనియన్, ఎఫ్–100తో న్యాయం జరిగిందని కార్మికులు తెలిపారు. యూనియన్ సభ్యులు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో 45 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన స్పిన్నింగ్ మిల్లు 2014లో మూతపడిందన్నారు. మిల్లులో పనిచేసిన కార్మికులకు గ్రాట్యుటీ, ఇతర ప్రయోజనాలు దక్కలేదన్నారు. దీనిపై కార్మికులందరూ టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు జే.వి.నరసింహమూర్తిని కలిసి సమస్య విన్నవించడం జరిగిందన్నారు. అనంతరం ఈ విషయమై బెంగళూరు, అమరావతి ప్రాంతాల్లో కోర్టులో కేసులు వేసి కార్మికులకు రావాల్సిన గ్రాట్యుటీతోపాటుగా అదనంగా రూ.2.19 లక్షలు సాధించారన్నారు. స్పిన్నింగ్ మిల్లు గ్రాట్యుటీ చెల్లింపుల విషయంలో నరసింహమూర్తి సహకారం మరువలేనిదన్నారు.

1,849 లీటర్ల మద్యం ధ్వంసం



మద్యం ధ్వంసం చేస్తున్న అధికారులు

మదనపల్లె : మదనపల్లె ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో నాటు సారా, ఆంధ్ర, కర్నాటక, ఇతర రాష్ట్రాలకు చెందిన 1,849 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. మదనపల్లె మండలం అంకిశెట్టిపల్లె పంచాయతీ విజయా డెయిరీ వెనుక ఖాళీ స్థలంలో 79 కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాని విలువ రూ.8,52,720 ఉంటుందన్నారు. అనంతరం సూపరింటెండెంట్ శ్రీనివాస్ స్టేషన్ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారన్నారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వహించిన సిబ్బంది పనితీరును అభినందించారన్నారు. నేరాలను అదుపులో ఉంచాలని, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను వేలం వేయాలని ఆయన సూచించారు.

మైనర్.. నో రయ్ రయ్



- జూన్ నుంచి అమల్లోకి వాహన చట్టం
- మైనర్లకు వాహనాలు ఇస్తే జైలు
- మందుబాబులకు భారీగా జరిమానా

గతంలో చట్టం నిబంధనలు..

గతంలో వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిచ్చినపుడు ప్రమాదాలకు గురైతే రూ.1000 జరిమానా విధించారు. నేరం నిరూపితమయ్యే వరకు జువైనల్ కోర్టుకు బాలుడు ప్రతి శుక్రవారం హాజరయ్యే ప్రక్రియ ఉండేది. బాధితుల తరపున వారు.. బాలుడి తరపున వారు మాట్లాడుకునే వెసలుబాటును బట్టి ఉండేది. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి గతంలో రూ.2వేల జరిమానా, ఆరు నెలల జైలు శిక్ష ఉండేది.

సవరించిన చట్టం ప్రకారం..

నూతన సవరించిన వాహన చట్టం ప్రకారం మైనర్లకు వాహనాలిస్తే ఆ బండి ఎవరి పేరిట ఉంటే (తల్లిదండ్రులు, సంరక్షకులకు) రూ.25 వేల జరిమానాతోపాటు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తారు. తాజాగా సవరించిన చట్టం ప్రకారం మద్యం తాగి వాహనాలు నడిపేవారికి రూ.10వేల జరిమానాతోపాటు ఆరు నెలల జైలు శిక్ష ఉంటుంది. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ నిబంధనలు అమలులోకి వచ్చాయి.

జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల వివరాలు			
సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2020	825	307	970
2021	861	368	949
2022	801	403	837
2023	631	372	730
2024 ఇప్పటి వరకు	214	100	233

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రోడ్లపై ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహన దారులపై కేంద్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. జిల్లాలో 2020 నుంచి ఇప్పటి వరకూ 3332 ప్రమాదాలు చోటు చేసుకోగా 1550 మంది మృతి చెందారు. సుమారు 3719 మంది క్షతగాత్రులయ్యారు. ఈ నేపథ్యంలో ప్రమాదాలు జరగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ నిండు ప్రాణాలు పోవడానికి కారణమవుతున్న మైనర్లు బైక్ నడపకుండా చెక్ పెట్టింది. వయస్సు అనుమతి లేకపోయినా రయ్ మంటూ పోనిస్తూ పాదచారులు, వాహదారులను వణికిస్తున్న వారిని హెచ్చరిస్తూ వాహన చట్టం సవరించి జూన్ ఒకటో తేదీ నుంచి అమలులోకి తెచ్చింది. రహదారిపై సురక్షిత ప్రయాణం ఉండాలనే సంకల్పంతో ఈ చట్ట సవరణకు ఆమోదం తెలిపింది.

వాహన చట్టానికి సవరణ

కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలులో ఉన్న వాహన చట్టంలో కొన్ని మార్పులు తెచ్చింది. 2019 సెప్టెంబర్, 01న నూతన చట్టం అమల్లోకి తెచ్చి.. వాహన దారులకు విధించే జరిమానాల్లోనూ భారీ మార్పులు తెచ్చింది. అయినప్పటికీ మైనర్లు బైక్ నడుపుతూ అమాయకుల ప్రాణాలు పోవడానికి కారణమవుతున్నారు. మందుబాబులు ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. జిల్లాలో ఈ మధ్య జరిగిన ఎన్నో రోడ్డు ప్రమాదాలే ఇందుకు సాక్షి. ఇకపై వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేసేలా జూన్ 1 నుంచి కొత్త వాహన చట్టాన్ని అమలులోకి వచ్చింది.



హెల్మెట్‌పై అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న, రవాణా, పోలీసు అధికారులు

నిబంధనలు పాటించాల్సిందే...

జిల్లాలో ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలు పాటించాల్సిందేనని రవాణాశాఖ అధికారులు చెబుతున్నారు. లేకుంటే భారీ జరిమానా తప్పదని హెచ్చరిస్తున్నారు. ప్రాణం చాలా విలువైందని కొద్దిపాటి నిర్లక్ష్యం వహించినా.. కుటుంబ సభ్యులకు తీరని శోకం మిగులుతుండడంతో లైసెన్స్ ఉంటేనే వాహనాలను నడపాలని, ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ ధరించాలని, ట్రాఫిక్ సిగ్నల్స్ రోడ్డు సంకేతాలు పాటించాలని, సెల్ ఫోన్ డ్రైవింగ్, మద్యం తాగి వావానాలను నడపరాదని, కార్లలో సీట్ బెల్ట్ తప్పనిసరి అని రవాణాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు



జిల్లాలోని వాహన యజమానులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదు. మైనర్లు వాహనాలు నడిపినపుడు తమ తనిఖీల్లో పట్టుబడితే వాహన యజమానిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. ప్రతి ద్విచక్ర వాహనాదారుడు హెల్మెట్, కార్లలో సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాల్సిందే. – ఈ.మీరా ప్రసాద్, ఉప రవాణాశాఖ కమిషనర్, వైఎస్ఆర్ జిల్లా

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : యజమాని వద్ద చేసిన అప్పు తీర్చలేక మనస్తాపంతో ఒకరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండకు చెందిన సయ్యద్‌బాషా కుమారుడు సయ్యద్‌షావలి(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. యజమాని వద్ద వ్యక్తిగత అవసరాలకు రూ.96 వేల నగదు అప్పు చేశాడు. అప్పు తీర్చే క్రమంలో వేధింపులకు గురికావడంతో మనస్తాపం చెంది శుక్రవారం చీమల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

మదనపల్లె : పనులకు వెళుతున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తి గొలుసు చోరీ చేసిన ఘటన మదనపల్లె మండలంలో శుక్రవారం జరిగింది. వలసపల్లె కాలనీకి చెందిన పి.లావణ్య(37) బండకిందపల్లె వద్ద ఉన్న డీకే.గ్రానైట్స్‌లో పనిచేస్తోంది. తన సహాయకురాలు దేవిశ్రీతో కలిసి శుక్రవారం ద్విచక్ర వాహనంలో విధులకు బయలుదేరింది. మార్గమధ్యంలో 150వ మైలు వాణి బిల్డింగ్ సమీపంలో పాల ప్యాకెట్లు కింద పడిపోవడంతో, వాహనం ఆపి తీసుకుంటుండగా, వెనుక నుంచి ద్విచక్ర వాహనంలో వ్యక్తి ఆకస్మాత్తుగా వచ్చిన వ్యక్తి మెడలో గొలుసు లాక్కుని పరారయ్యాడు. బాధితురాలు తాలూకా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని చోరీ ఘటనపై ఫిర్యాదుచేసింది. గొలుసు 20 గ్రాముల బరువు ఉందని, విలువ రూ.96 వేలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదుచేసినట్లు సీఐ ఎన్.శేఖర్ తెలిపారు.

యువతి అదృశ్యం

మదనపల్లె : యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ వలీబాషా తెలిపారు. పట్టణం లోని బుగ్గకాలువకు చెందిన మస్తాన్‌వలి కుమార్తె ఎస్.అంజుమ్(19) గురువారం అంగడికి వెళ్లి ఎంతసేపటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో సోదరుడు షేక్ రఫీ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు హెడ్‌కానిస్టేబుల్ మోహన్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుత్తు షాక్‌తో బాలుడికి గాయాలు

మదనపల్లె : విద్యుత్తు షాక్‌తో బాలుడు గాయపడిన సంఘటన పట్టణంలో శుక్రవారం జరిగింది. స్థానిక రెడ్డీస్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ కుమారుడు లలిత్ ఆదిత్య(10) ఇంటి వద్ద ఆడుకుంటూ ప్రమాదవశాత్తూ విద్యుత్తు షాక్‌కు గురయ్యాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడగా, కుటుంబసభ్యులు వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాలుడిని రెఫర్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తినరసింహారెడ్డి



సమావేశానికి హాజరైన ఎస్టీయూ నాయకులు

రాయచోటి అర్బన్ : నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం ఉపాధ్యాయుల ఆకాంక్షల మేరకు ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో శుక్రవారం జరిగిన తొలి కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గత పాలకుల చర్యలతో పాఠశాలలు బలహీన పడ్డాయని, నాణ్యమైన విద్య పిల్లలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. నూతనంగా ఏర్పడబోయే ప్రభుత్వం 117 జీవో రద్దుచేసి పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంతోపాటు, తెలుగు మాధ్యమం కొనసాగించాలన్నారు. ఇదే సమయంలో ఉద్యోగ సంఘాల నాయకులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దుచేయడంతోపాటు హెల్త్ కార్డులను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాలన్నారు. ఈ సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి శ్రీనివాస్, మల్లు రఘునాథరెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అంకం శివారెడ్డి, మధుసూదన్, నేతలు సుబ్రహ్మణ్యం రాజు, ఆదినారాయణరెడ్డి, కడియాల మురళి, మహేశ్వరరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, జనార్దన్ రెడ్డి, మున్వర్‌బాషా, గోపీకృష్ణ పాల్గొన్నారు.

ఫార్మసీ విద్యార్థులకు అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న బసప్ప

రాజంపేట : ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగావకాశాలపై స్థానిక అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మెయిన్స్ స్ప్రింగ్ సీఈవో కె.భసప్ప క్లినికల్ రీసర్చ్ విభాగంలో క్లినికల్ రీసెర్చ్ కో–ఆర్డినేటర్, అసోసియేట్ ఉద్యోగాలలో ఎలా సేవలందించాలో వివరించారు. ఫార్మకో విజిలెన్స్ విభాగం, డేటా మేనేజ్‌మెంట్, సైంటిఫిక్, మెడికల్ రైటింగ్, హెచ్‌ఈవోఆర్ హెల్త్ ఎకనామిక్స్ అవుట్‌కంరీసెర్చ్ విభాగాలలో ఉద్యోగావకాశాల గురించి తెలిపారు. ఔషధ పరిశోధకులు, క్లినికల్ డెవలప్‌మెంట్ రోగితో అనుసంధానమై దుష్పలితాలను అందిస్తున్న మందులను ఎలా మార్కెట్‌లో విడుదల చేస్తారనే అంశాలను వివరించారు. ప్రిన్సిపల్ స్వర్ణలత మాట్లాడుతూ ఫార్మసీ విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు దేశ, విదేశాలలో రాణిస్తున్నారన్నారు. సదస్సులో ప్లేస్మెంట్ అండ్ ట్రైనింగ్ బృంద డా.ఎం.శిరీష, డా.గిరిజాశంకర్, డా.హంజాద్‌బేగ్, డా.ప్రమోద్, డా.మణిదీప్, ఫార్మ–డీ విద్యార్థులు పాల్గొన్నారు.

రైస్ మిల్లుల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

మైదుకూరు : కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ షేక్ మాసూంబాషా ఆధ్వర్యంలో కడప విజిలెన్స్ అధికారులు, పౌర సరఫరాల అధికారులుపలు రైస్‌మిల్లుల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. మైదుకూరులోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీ గణేశా మెగా మోడరన్ రైస్ మిల్, శ్రీలక్ష్మీ సుబ్బరాయ మోడరన్ రైస్‌మిల్‌లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మిల్లుల్లో నిల్వలు చూసి రికార్డులను పరిశీలించారు. బియ్యపు బస్తాలపై ప్యాకేజీ డిక్లరేషన్ లేకపోవడం, ప్యాకింగ్ మిషన్ వెరిఫికేషన్ సర్టిఫికెట్ లేనట్లు గుర్తించి రూ.75వేల అపరాధ రుసం విధించారు. నేమ్ బోర్డులు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను ప్రదర్శించకపోవడంతో రూ.లక్ష అపరాధ రుసం విధించారు. కడప రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి మాసూంబాషా మాట్లాడుతూ మిల్లుదారులు ఎవరైనా ప్రభుత్వ నిబంధనలను పాటించకపోయినా, అవకతవకలకు పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో టి.రెడ్డప్ప, జి.ఈదురుబాషా, డి.అర్జున్‌రావు, ఏఎస్ఓ సి.తారకనాథ రెడ్డి, రవీంద్రా రెడ్డి పాల్గొన్నారు.

చౌక దుకాణంలో తనిఖీలు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని మూడో వార్డులోని బాషా చౌక దుకాణాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చాముండేశ్వరి శుక్రవారం తనిఖీ చేశారు. కేటాయించిన వాటికంటే అదనంగా నాలుగు బస్తాల బియ్యం ఉన్నాయని, డీలర్‌పై చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు సుదర్శన్, ఆర్ఐ నాగమోహన్‌రెడ్డి, ఎఫ్ఐ సాయిప్రసాద్‌రావు బియ్యాన్ని తూకంవేసి మరో రేషన్ షాప్‌లో నిల్వచేశారు.

ప్రహరీ కూల్చివేత.. కేసు నమోదు



బీకేపల్లె వీవర్స్ కాలనీలో ధ్వంసమైన ప్రహరీ

మదనపల్లె : పట్టణంలోని బీకే.పల్లె వీవర్స్ కాలనీలోని సొంత స్థలంలో ప్రహరీ కూల్చివేతపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు టూటౌన్ సీఐ యువరాజు తెలిపారు. విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ..వీవర్స్ కాలనీలోని సర్వేనెంబర్.102లో 1.26 ఎకరాల భూమిని వరదా సురజ్‌శ్రీ నుంచి ఎస్‌బీఐ కాలనీకి చెందిన పోతిరెడ్డి వసంత్ రెడ్డి కొనుగోలు చేశారన్నారు. చుట్టూ ప్రహరీ నిర్మించి గేటు ఏర్పాటు చేసి.. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం తనకు పరిచయస్థుడైన కొక్కంటి శివశంకర్‌కు టిప్పర్స్, ట్రాక్టర్స్ పార్కింగ్ చేసుకునేందుకు వసంత్‌రెడ్డి ఆ స్థలం ఇచ్చారన్నారు. మూడు రోజుల కిందట వరదారెడ్డిశేఖర్, వరదావిద్యాసాగర్, వరదా బాలు, నాగేంద్రప్రసాద్, మరింత మంది స్థలంలోకి ప్రవేశించడమేగాక, కాంపౌండ్‌వాల్, సీసీ కెమెరాలు ధ్వంసం చేశారన్నారు. స్థల యజమాని పోతిరెడ్డి వసంత్‌రెడ్డి ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకటసుబ్బయ్య క్షేత్ర స్థాయిలో విచారణ చేసి, నిందితులపై కేసు నమోదుచేసినట్లు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి గాయాలు



ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడిన అంజద్‌ఖాన్

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ఆటో ఢీకొని ఒకరు గాయపడిన సంఘటన శుక్రవారం పీటీఎం మండలంలో జరిగింది. కందుకూరుకు చెందిన వలీఖాన్ కుమారుడు పి.అంజద్ ఖాన్(39) పంటకు కావాల్సిన మందుల కోసం చేలూరు వెళ్లి తిరిగి ద్విచక్ర వాహనంలో కందుకూరుకు వస్తున్నారు. మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ప్రమాదంలో అంజద్ ఖాన్ కాలు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం బాధితుడిని తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

బీజేపీకి సొంత బలం లేదు




మాట్లాడుతున్న చంద్రశేఖర్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో బీజేపీకి సొంత బలం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత విపక్షాల సీఎంలను భాజపా అరెస్టు చేయించినా, రాహుల్‌గాంధీ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేసినా, భావోద్వేగ ప్రసంగాలు చేసినా, సీబీఐ, ఈడీలను అడ్డుపెట్టుకుని విపక్ష పార్టీలను విచ్ఛిన్నం చేసినా బీజేపీ ప్రకటించిన 400 ఎంపీ సీట్లు సాధించలేకపోయిందన్నారు. మోదీ బ్రాండ్ విద్వేష రాజకీయాలకు దేశ ప్రజలు ×చెక్ పెట్టారన్నీ గుర్తు చేశారు. రాజ్యాంగాన్నే మార్చేస్తాం, రిజర్వేషన్లు రద్దు చేస్తాం, మహిళలు, దళితులు, మైనార్టీలపై దాడులు చేస్తాం అన్న బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులకు ఓటమి తప్పలేదని హెచ్చరించారు. 2019 ఎన్నికల్లో ఆ పార్టీకి 303 సీట్లు రాగా, 2024 ఎన్నికల్లో సిట్టింగ్ 63 ఎంపీ సీట్లలో ప్రజలు ఓడించారన్నారు. దేశంలో పోలైన 64 కోట్ల ఓట్లలో మెజార్టీ ఓటర్లు ఆ పార్టీని తిరస్కరించారన్నార్లు. 'పార్లమెంట్ జాయింట్ యాక్షన్ కమిటీ' విచారించి షేర్ల కుంభకోణాన్ని వెలుగులోకి తీయాలని, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయించాలని కోరారు.

వైఎస్సార్ జిల్లా ఎద్దులకు ద్వితీయ స్థానం

బేస్తవారిపేట : మండలంలోని పూసలపాడులో అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో సత్యసాయి జిల్లా సీకే.పల్లి మండలం పుల్లేటిపల్లికి చెందిన బొబ్బిలి భాస్కర్‌రెడ్డి ఎద్దులు 3,845 అడుగులు లాగి మొదటి స్థానంలో నిలిచాయి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండలం రంగసాయిపల్లికి చెందిన మార్తాల వెంకట సుబ్బారెడ్డి ఎద్దులు 3767 అడుగులు లాగి ద్వితీయ, నంద్యాల జిల్లా జిల్లా పరం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్ రెడ్డి ఎద్దులు 3250 అడుగులు లాగి తృతీయ, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ఎ.కోడూరుకు చెందిన చాగంటి నాగమల్లిఖార్జున రెడ్డి ఎద్దులు 3143 అడుగులు లాగి నాలుగు, యర్రగొండపాలేనికి చెందిన హుస్సేన్ ఎద్దులు 3042 అడుగుల దూరం లాగి ఐదో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు వరుసగా రూ.40 వేలు, 30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలను దాతలు పంపిణీ చేశారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నరేంద్ర

ములకలచెరువు : ప్రేమ జంట పురుగులు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్ఐ తిప్పేస్వామి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని దేవుల చెరువుకు చెందిన నరేంద్ర(22) వేపూరికోట పెట్రోల్ బంకులో పని చేస్తున్నాడు. వేపూరికోట పంచాయతీ ఎద్దులవారిపల్లెకు చెందిన మైనర్ బాలిక(17)ను కొంత కాలంగా ప్రేమిస్తున్నారు. వీరి వివాహానికి పెద్దలు ఒప్పుకోకపోవడంతో మండలంలోని సంద్రడవిలోకి వెళ్లి పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యారు. మేకల కాపరులు గమనించి ఎస్ఐ తిప్పేస్వామికి సమాచారం అందించారు. స్పందించిన ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకొని తన వాహనంలో ప్రేమ జంటను మదనపల్లె ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

మద్యం మత్తులో వీరంగం

కురబలకోట : మండలంలోని అంగళ్లు వద్ద ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు తాగిన మైకంలో గురువారం రాత్రి హల్‌చల్ చేశారు. ప్రైవేటు హాస్టల్ లోని సహ విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేయడమేగాక.. మాపైనే పోలీసులకు చెబుతారా.? అంటూ చేయి చేసుకున్నారు.. స్థానిక పోలీసుల కథనం మేరకు..అంగళ్లులోని ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులు గురువారం రాత్రి పూటుగా మద్యం తాగారు. మాటా మాటా పెరిగి విచక్షణ కోల్పోయారు. హాస్టల్‌లో సహ విద్యార్థులపై చేయి చేసుకుని చంపుతామని బెదిరించారు. దీంతో వారు భయపడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు తాగుబోతు విద్యార్థులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. మరింత రెచ్చిపోయిన ఆ విద్యార్థులు తిరిగి హాస్టల్ వద్దకు వెళ్లి మాపైనే పోలీసులు చెబుతారా..బయటకు రండిరా అంటూ కత్తులు చూపి చంపుతామని బెదిరించి నిర్బంధించారు. ఈ విషయం కాస్త బాధిత విద్యార్థుల తల్లిదండ్రులకు తెలియడంతో వారు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లిఖార్జునరెడ్డి తనదైన శైలిలో పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి మద్యం తాగిన విద్యార్థులను హెచ్చరించారు. ఇక ఎలాంటి గొడవలకు వెళ్లబోమని చెప్పడంతో వారి భవిష్యత్తు దృష్ట్యా కౌన్సిలింగ్ ఇచ్చి పంపివేశారు.

హం దో హమారే బారా సినిమాను నిషేధించాలి



కలెక్టర్ విజయరామరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న అఖిల పక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పవిత్రమైన ఖురాన్‌కు వ్యతిరేకంగా నిర్మించిన 'హం దో – హమారే బారా' సినిమాను నిషేధించాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ నాయకులు మహ్మద్ అలీఖాన్ పేర్కొన్నారు. కలెక్టర్ విజయరామరాజు, ఏఎస్పీలకు శుక్రవారం ఆయన ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇస్లాం సంప్రదాయం, ముస్లిం మహిళల వ్యక్తిగత జీవితాలను వక్రీకరిస్తూ అన్నుకపూర్ తీసిన సినిమా వారి మనోభావాలను గాయపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇస్లాం సంప్రదాయంపై ఇష్టం వచ్చిన భావజాలంతో చిత్రాన్ని నిర్మించిన నిర్మాత, దర్శకులు, నటీనటులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ మైనార్టీ విభాగ ఉపాధ్యక్షుడు మహమ్మద్ అలీఖాన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు, ప్రముఖ సంఘ సేవకుడు సలావుద్దీన్, జేఏసీ జిల్లా కన్వీనర్ బాబుభాయ్, మత గురువు అబ్దుల్ రెహమాన్, ఎ మైనార్టీ ఫోరం రైట్స్ నేత దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

జమ్మలమడుగు రూరల్ : అప్పుల బాధ తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం జమ్మలమడుగు మండలంలో చోటుచేసుకొంది. పట్టణ ఎఎస్ఐ మురళీమోహన్ వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలపరిధిలోని గొరిగెనూరు గ్రామానికి చెందిన ఇంజెటి ఉదయ్‌కుమార్ (30) బేల్దారి పనులు చేసుకొని జీవిస్తున్నారు. మూడు నెలల కిందట రోడ్డు ప్రమాదంలో గాయపడిన అతడు పనులకు వెళ్లలేకపోవడంతో అప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఇంట్లో భార్య, భర్త మధ్య గొడవలు జరిగాయి. ఏమి చేయాలో తెలియక జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. భార్య సలోమి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జలాశయంలో దూకిన వృద్ధురాలు

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకోబోతున్న వృద్ధురాలు చెన్నమ్మను బోటు డ్రైవర్లు కాపాడారు. ఈ సంఘటన శుక్రవారం మైలవరం మండల కేంద్రంలో చోటుచేసుకొంది. ఎస్ఐ రెడ్డిసురేష్ వివరాల మేరకు.. కర్నూలు జిల్లా చాగలమర్రి మండలం చిన్న బోధనం గ్రామానికి చెందిన చెన్నమ్మ గత కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మైలవరం చేరుకుని స్థానిక జలాశయంలో దూకింది. కట్టపై వెళ్తున్న బోటు డ్రైవర్ ఎస్. శ్రీనివాసరావు, లస్కర్ బెన్నయ్య జలాశయంలో దూకి వృద్ధురాలిని బయటకు తీసి కాపాడారు. వెంటనే ఆమెను పోలీసులకు అప్పగించారు. తనది చిన్న బోధనం గ్రామమని చెప్పడంతో కుటుంబ సభ్యులను పిలిపించి విచారించగా ఎటువంటి సమస్యలు లేవని తెలిపారు. దీంతో పోలీసులు కుమారుడు, మనువడ్లకు వృద్ధురాలిని అప్పగించారు. కాపాడిన శ్రీనివాసులును ఎస్ఐ రెడ్డి సురేష్ అభినందించారు.